క్లుప్తంగా

హైస్కూల్‌కు వాటర్ కూలర్ బహూకరణ



హైస్కూల్‌కు వాటర్ కూలర్ అందజేసిన దాత

సామర్లకోట: జి.మేడపాడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థుల కోసం దాత సోమవారం వాటర్ కూలర్ బహూకరించారు. కాకినాడ వైభవ్ జ్యూవెలర్స్‌కు చెందిన సంస్థ సీఎస్సార్ నిధుల నుంచి ఈ కూలర్ బహూకరించిందని హెచ్ఎం జి.పాండవులు తెలిపారు. సీనియర్ మార్కెట్ ఎగ్జిక్యూటివ్ ఆర్ శ్రీనివాసరావు ఈ కూలర్‌ను అందజేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ యార్లగడ్డ బంగార్రాజు, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయంలో మజ్జిగ చలివేంద్రం

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో సోమవారం మజ్జిగ చలివేంద్రాన్ని ఈఓ భళ్ల నీలకంఠం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఆలయానికి వచ్చే భక్తుల కోసం ప్రతి రోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు మజ్జిగ పంపిణీ చేస్తామని చెప్పారు. దాతలు ముందుకొస్తే వారి పేరున మజ్జిగ పంపిణీ చేస్తామన్నారు. ఎండలు తగ్గే వరకూ మజ్జిగ పంపిణీ కొనసాగుతుందని చెప్పారు. భక్తులు మజ్జిగ స్వీకరించి, వడగాడ్పుల నుంచి రక్షణ పొందాలన్నారు.

అన్నసమారాధన

కొత్తపల్లి: మండలంలోని మూలపేటలో వేంచేసిన వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద సోమవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. స్వామివారి కల్యాణోత్సవాలను పురస్కరించుకుని భక్తుల ఆర్థిక సాయంతో పలు రకాల వంటకాలతో భారీ అన్నదానం నిర్వహించారు. మూలపేట, కొత్తమూలపేట, నాగులపల్లి, అమరవల్లి, రామన్నపాలెం తదితర గ్రామల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహాల ప్రతిష్ఠ



రామాలయంలో పూజలు చేస్తున్న ట్రైనీ డీఎస్పీ

సామర్లకోట: జగ్గమ్మగారిపేట శెట్టిబలిజపేటలో నూతనంగా నిర్మించిన రామాలయంలో సోమవారం హనుమాన్, లక్ష్మణ, సీతా సమేత కల్యాణ కోదండ రామచంద్రస్వామి విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం భక్తి శ్రద్ధలతో జరిగింది. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భగవద్గీత ప్రచారకులు మల్లికార్జున స్వామి ఆధ్వర్యంలో విగ్రహాల ప్రతిష్ఠ జరిగింది. ట్రైనీ డీఎస్పీ సాయి ఈశ్వర్‌యశ్వంత్ ముఖ్యఅతిథిగా పాల్గొని, పూజలు చేశారు. భారీ అన్నదాన కార్యక్రమం జరిగింది. హిందూధర్మ పరిరక్షణ సమితి, ఆలయ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

జ్యోతిష శాస్త్రంలో నానికి అవార్డు



సామర్లకోట రైల్వే స్టేషన్‌లో నానిని సత్కరిస్తున్న వీరభద్రరావు తదితరులు

సామర్లకోట: పట్టణానికి చెందిన వెదురుపావులూరి నాని జ్యోతిష శాస్త్రంలో విశ్వగురు అవార్డు పొందారు. జ్యోతిష శాస్త్రంలో ప్రపంచ రికార్డు సాధించిన నాని హైదరాబాద్‌లో నిర్వహించిన ఉగాది పురస్కారాల్లో అవార్డును పొందినట్టు నాయీబ్రాహ్మణ సంఘ కాకినాడ జిల్లా గౌరవాధ్యక్షుడు స్వయంభారపు వీరభద్రరావు (14వ వార్డు కౌన్సిలర్) తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్ నుంచి సోమవారం సామర్లకోట వచ్చిన నానిని సామర్లకోట రైల్వే స్టేషన్‌లో వీరభద్రరావు సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సంఘ రాష్ట్ర కార్యదర్శి వెల్లిపాక నాగబాబు, ఎం అబ్రహం పాల్గొన్నారు.

శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్ల పంపిణీ



మహిళలకు సర్టిఫికెట్లు అందిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సోమవారం ఆ సంస్థ ప్రతినిధులు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ప్రతిభా కేంద్రంలో శిక్షణ పూర్తి చేసుకున్న 25 మంది మహిళలకు కెనరా బ్యాంక్ మేనేజర్ ధర్మారావు, అరబిందో ఫార్మా ఫౌండేషన్ జనరల్ మేనేజర్ సుధాకర్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సంక్షేమానికి పట్టం కట్టండి

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత
- పిఠాపురంలో ఎన్నికల ప్రచారం



పిఠాపురంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వంగా గీత, పెండెం దొరబాబు



గొల్లప్రోలులో ఎన్నికల ప్రచారం చేస్తున్న వంగా గీత

పిఠాపురం: మునుపెన్నడూ లేనివిధంగా రూ.కోట్ల తో నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి వచ్చే ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్ సీపీకి పట్టం కట్టాలని ఆ పార్టీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత విజ్ఞప్తి చేశారు. పిఠాపురంలోని 28, 29 వార్డుల్లో ఎమ్మెల్యే పెండెం దొరబాబుతో కలిసి సోమవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే పరమావధిగా తమ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మరో అవకాశం ఇవ్వాలని కోరారు. పిఠాపురం నియోజకవర్గాన్ని చరిత్రలో నిలిచిపోయేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.కోట్లతో అభివృద్ధి చేశారన్నారు. నియోజకవర్గంలో ప్రధాన సమస్యలకు ఇప్పటికే పరిష్కారం చూపించామన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి పిలిస్తే పలికే వారు ఎమ్మెల్యే కావాలని, అందుకే తనకు ప్రజలు పూర్తి మద్దతు ప్రకటిస్తున్నారని తెలిపారు. 30 ఏళ్లకు పైగా రాజకీయ అనుభవంతో పాటు పిఠాపురం ప్రజలకు సుపరిచితురాలుగా ఉన్న తనను ప్రతిఒక్కరూ ఆప్యాయంగా పలకరించి ఆహ్వానాలు పలుకుతున్నారని, అదే తన విజయానికి సంకేతం అన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా తన గెలుపును ఆపలేరన్నారు. అడుగడుగునా స్థానికులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. మీ వెంటే మేము ఉంటామని భరోసా ఇచ్చారు.

అర్హతే ప్రామాణికంగా పథకాలు

ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే పెండెం దొరబాబు మాట్లాడుతూ కులమతాలు, రాజకీయాలకు అతీతంగా కేవలం అర్హతే ప్రామాణికంగా పథకాలు పంపిణీ చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల ఇంటికే పథకాలు పంపిణీ చేశారన్నారు. అందుకే ప్రజలు వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసేకోవాలనే తపనతో ఉన్నారన్నారు. పిఠాపురంలో మళ్లీ వైఎస్సార్ సీపీ జెండా ఎగరడం ఖాయమన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సూరవరపు సుజాత, ప్రకాష్, రాయపురెడ్డి పావని, రాజా, గండేపల్లి బాబీ, కొత్తపల్లి బుజ్జి, వులవల భూషణం, పార్టీ పట్టణాధ్యక్షుడు బొజ్జా దొరబాబు, రాచమళ్ల వెంకటేశ్వరరావు, టీకు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

గొల్లప్రోలు: గత ఐదేళ్లలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఓటు వేయాలని ఆ పార్టీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గొల్లప్రోలు పట్టణంలోని 1,2,3 వార్డుల్లో సోమవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలసి ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. వైఎస్సార్ సీపీ నాయకులు గండ్రేటి శీరామ చంద్రమూర్తి, మొగలి బాబ్జీ, మొగలి అయ్యారావు, జ్యోతుల భీముడు, మైనం రాజా, అనిశెట్టి వెంకట సుబ్బారావు, తెడ్లపు చిన్నారావు, గంధం చిన్నారావు పాల్గొన్నారు.

సీఎం జగన్‌పై హత్యాయత్నం అమానుషం



చేబ్రోలులో రాస్తారోకో చేస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

- జెడ్పీటీసీ నాగలోవరాజు
- చేబ్రోలులో సీఎంపై దాడికి నిరసనగా ఆందోళన

గొల్లప్రోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బస్సుయాత్ర ద్వారా వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు హత్యాయత్నం చేయడం అమానుషం అని జెడ్పీటీసీ ఉలవకాయల నాగలోవరాజు అన్నారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులో సోమవారం సీఎం వైఎస్ జగన్‌పై దాడికి నిరసనగా రాస్తారోకో నిర్వహించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి భద్రత పెంచాలని కోరారు. ప్రజాదరణతో దూసుకుపోతున్న సీఎం జగన్ ప్రభంజనాన్ని దాడులతో ఆపలేరన్నారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఆయనకు పూర్తి భద్రత కల్పించాలని కోరారు. నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపిన పార్టీ శ్రేణులు, గ్రామస్తులు నిందితులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు పుప్పాల బాబులు, నాయకులు ఓరుగంటి చక్రి, వరి, ప్రసాద్, ఎస్.సూర్యనారాయణ, నూజివీడు సూర్య, వై.గంగారావు, ఎం.గంగాధర్, సూరిబాబు, కె.జ్యోతి, మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.



వాకతిప్పలో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

కొవ్వొత్తులతో నిరసన

కొత్తపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగిన హత్యాయతాన్ని ఖండిస్తూ మండలంలోని వాకతిప్పలో సోమవారం రాత్రి కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు, కాటూరి చిన్నబ్బాయి, బొడ్డు జగన్నాథం, పొన్నగంటి రామకృష్ణ, రాపర్తి బాబు, కుక్కల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిపై హత్యాయత్నం సిగ్గుచేటు



విలేకర్లతో మాట్లాడుతున్న గౌరకపూడి చిన్నయ్యదొర

సామర్లకోట: ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ అని ఉమ్మడి రాష్ట్ర మున్సిపల్ కౌన్సిల్ చాంబర్ మాజీ అధ్యక్షుడు గౌరకపూడి చిన్నయ్యదొర అన్నారు. సోమవారం స్థానిక సంపెంగతోటలోని ఆయన స్వగృహంలో విలేకర్లతో మాట్లాడారు. ఇటువంటి చర్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. దాడి చేసిన వారిని, దాడికి ప్రోత్సహించిన వారిని గుర్తించి, కఠినంగా శిక్షించాలని, భవిషత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. హత్యాయత్నానికి పాల్పడిన వారిపై చర్యలు ఉండకపోతే, ఇటువంటివి కొనసాగగలవని అనుమానం వ్యక్తం చేశారు. రాజకీయాల్లో స్నేహపూర్వక పోటీ ఉండాలని సూచించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నంపై ఎన్నికల సంఘం వెంటనే స్పందించాలన్నారు. రాజకీయ పార్టీలకు చెందిన వారు ఈ సంఘటనకు ప్రోత్సహించి ఉంటే, వారిని ఎన్నికల్లో పోటీకి అనర్హులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. రాజకీయ నాయకులపై ఇటువంటి సంఘటనలు మంచి సంప్రదాయం కాదన్నారు.

అభ్యర్థులు నిబంధనలు పాటించాలి

- నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి
- పిఠాపురం నియోజకవర్గ ఈఆర్వో రామ్‌సుందర్ రెడ్డి



పిఠాపురంలో రాజకీయ పార్టీల నేతలకు సూచనలిస్తున్న ఈఆర్వో రామ్‌సుందర్ రెడ్డి

పిఠాపురం: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో నామినేషన్లు వేసే అభ్యర్థులు, వారి అనుచరులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని జేసీ, పిఠాపురం నియోజకవర్గ ఈఆర్వో రామ్‌సుందర్ రెడ్డి సూచించారు. పిఠాపురం ఎన్నికల కార్యాలయంలో సోమవారం వివిధ రాజకీయ పార్టీల నేతలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ నెల 18న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఆ రోజు నుంచి నామినేషన్లు స్వీకరణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. నామినేషన్లు వేసే అభ్యర్థులు వారి అనుచరులు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలన్నారు. ఒక అభ్యర్థితో పాటు మరో నలుగురిని మాత్రమే నామినేషన్ల కేంద్రంలోకి అనుమతిస్తామన్నారు. నామినేషన్ కేంద్రానికి 100 మీటర్ల దూరంలో మాత్రమే అభ్యర్థుల అనుచరులు ఉండాలన్నారు. ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ మాత్రమే నామినేషన్లు స్వీకరిస్తారని తెలిపారు. అభ్యర్థులు నామినేషన్‌తో పాటు ఆస్తులు, అప్పులు, కేసుల వివరాలు రూ.10 స్టాంప్ పేపర్‌పై అఫిడవిట్ దాఖలు చేయాలన్నారు. అభ్యర్థులు రూ.10 వేల నామినేషన్ ఫీజు చెల్లించాలని ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులైతే రూ.5 వేలు చెల్లించాలన్నారు. రికగ్నైజ్డ్ అభ్యర్థులు తనకు ప్రపోజర్‌గా ఒక వ్యక్తిని నియమించుకోవచ్చని, అతను పిఠాపురం నియోజకవర్గంలో ఎక్కడైనా ఓటు హక్కు కలిగి ఉండాలన్నారు. అభ్యర్థులు మాత్రం రాష్ట్రంలో ఎక్కడైనా ఓటు హక్కు కలిగి ఉండొచ్చన్నారు. ప్రతి అభ్యర్థి కొత్తగా ఓపెన్ చేసిన బ్యాంకు అకౌంట్ వివరాలు ఇవ్వాలని, తాము చేసే ఎన్నికల ఖర్చును ప్రతీరోజూ దానిలో చూపించాలన్నారు. నోటిఫికేషన్ ఇచ్చిన నాటి నుంచి పిఠాపురం ఎన్నికల ప్రధాన కార్యాలయంలో హెల్ప్ డెస్క్ నిరంతరం పని చేస్తుందన్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. వివిధ రాజకీయ పార్టీల నేతలు పాల్గొన్నారు.

మీలో ఒకడిని.. అవకాశమివ్వండి

- వైఎస్సార్ సీపీ అభ్యర్థి దవులూరి దొరబాబు
- 26, 22 వార్డుల్లో ఇంటింటా ప్రచారం



సామర్లకోట 22వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న దొరబాబు

సామర్లకోట: పెద్దాపురం నియోజకవర్గంలో సామర్లకోటకు చెందిన నేను మీలో ఒకడిని.. స్థానికుడైన నాకు అవకాశం వచ్చింది.. నన్ను ప్రతి ఒక్కరూ ఆశీర్వదించండంటూ వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి దవులూరి దొరబాబు ఓటర్లను అభ్యర్థించారు. సోమవారం 22, 26 వార్డుల్లో సీనియర్ నాయకులు, కౌన్సిలర్లు నక్కా జానికిరామారావు, శ్రీనివాసరావు, గౌరకపూడి చిన్నయ్యదొర, సేపెని సురేష్ ఆధ్వర్యంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అడుగడుగునా మహిళలు హారతులు పడుతూ ఆయనకు స్వాగతం పలికారు. సుమారు 40 ఏళ్ల తర్వాత స్థానిక అభ్యర్థిగా వైఎస్సార్ సీపీ నుంచి పోటీ చేసే అవకాశాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనకు కల్పించారని తెలిపారు. ప్రజలు ఆశీర్వదించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. స్థానికేతరులకు నియోజకవర్గ సమస్యలపై అవగాహన లేకపోవడం వల్ల అభివృద్ధి జరగలేదని విమర్శించారు. ప్రజలకు తాను అందుబాటులో ఉంటానని, ప్రజా సమస్యలు పరిష్కరించి, నియోజకవర్గాన్ని సుందరంగా తయారుచేస్తానని హామీ ఇచ్చారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలా ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకోవడానికే తాను రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు నవరత్నాల సంక్షేమ పథకాలే విజయానికి పునాది అని చెప్పారు.

పార్టీలో చేరిన 120 కుటుంబాలు

సామర్లకోట: నియోజకవర్గ పరిధిలోని మోటారు సైకిల్ మెకానిక్ యూనియన్ ప్రతినిధులు వైఎస్సార్ సీపీ అభ్యర్థి దవులూరి దొరబాబుకు మద్దతు పలికారు. సోమవారం సాయంత్రం యూనియన్‌కు చెందిన 120 కుటుంబాల వారు వైఎస్సార్ సీపీలోకి చేరారు. స్థానిక టీటీడీ కల్యాణ మంటపం రోడ్డులో యూనియన్ ప్రతినిధులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దొరబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ యూనియన్ సభ్యుల సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. యూనియన్ కార్యాలయ భవనానికి స్థలం కేటాయించాలని యూనియన్ ప్రతినిధులు ఆయనను కోరారు. ఆయన స్పందిస్తూ ఎమ్మెల్యేగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే స్థలం కేటాయిస్తామని చెప్పారు. ఇళ్లు లేని వారికి ప్రభుత్వం నుంచి స్థలాలిచ్చేలా కృషి చేస్తామని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో నియోజకవర్గ పరిశీలకుడు చీకట్ల కిషోర్, దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు ఆవాల లక్ష్మీనారాయణ, కంటే వీర్రాఘవరావు, జెడ్పీటీసీ గరవసాని సూరిబాబు, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు మన్యం చంద్రరావు, పెద్దాపురం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బందారు వీరబాబు, పార్టీ జిల్లా కార్యదర్శి తలారి దొరబాబు, మండల అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ పాగా సురేష్ కుమార్, కౌన్సిలర్లు కరణం రాజ్‌కుమార్, స్వయంభారపు వీరభద్రరావు, గుబ్బల సత్యనారాయణ, సొసైటీ అధ్యక్షులు మేకా శ్రీను, వీరంరెడ్డి నాని, కౌన్సిలర్లు సేపెని సురేష్, పిట్టా సత్యనారాయణ, గుబ్బల సత్యనారాయణ యార్లగడ్డ జగదీష్, చల్లపల్లి సత్యనారాయణ, సర్పంచ్ దమ్మాల లక్ష్మణరావు, నాయకులు గోపు మురళీ, కరణం భాను, చిట్టుమాని శ్రీనివాసరావు, అడబాల భద్రరావు, నమ్మి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దొరబాబు సతీమణి చంద్రకళ ప్రచారం

పెద్దాపురం: వైఎస్సార్ సీపీ పెద్దాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు సతీమణి చంద్రకళ పట్టణంలోని 15వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చిన్న కుమార్తె సాత్విక, అయ్యారక కార్పొరేషన్ చైర్మన్ ఆవాల లక్ష్మిరాజేశ్వరి, మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, ఇతర పార్టీ నేతలతో కలిసి ప్రచారం చేశారు. తన భర్తకు ఓటు వేసి గెలిపించాలని చంద్రకళ విజ్ఞప్తి చేశారు.

పకడ్బందీగా పోలింగ్ ప్రక్రియ

- సిబ్బందికి ఇబ్బందుల్లేకుండా చూడాలి
- ఆర్‌ఓ జేఎస్ రామారావు ఆదేశం




సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న ఆర్‌ఓ జేఎస్ రామారావు

పెద్దాపురం: రానున్న సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని పెద్దాపురం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ జేఎస్ రామారావు ఆదేశించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం ఉదయం రెండు పట్టణ, మండలాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నూరుశాతం పోలింగ్‌పై సిబ్బంది దృష్టి సారించి, మొబైల్ ప్రచారంతో పాటు, ప్రతి గ్రామ, వార్డుల్లో పోలింగ్ ప్రక్రియపై మరింత ప్రచారం చేపట్టాలని ఆదేశించారు. వచ్చే నెల 13న నిర్వహించే పోలింగ్ ప్రక్రియ ఏర్పాట్లను ముమ్మరం చేయాలన్నారు. పోలింగ్ ప్రక్రియలో పాల్గొనే అధికారులు, సిబ్బందికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. నియోజకవర్గంలో ఉన్న 200 పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని, ప్రత్యేకంగా హోం ఓటింగ్‌పై దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో పెద్దాపురం ఎంపీడీఓ జి.ఉషారాణి, తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కమిషనర్లు కేవీ పద్మావతి, రామారావు, డీటీ భానుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిర్వహణ బాధ్యత ఓపీఓలదే..

ఎన్నికల సమయంలో విధులు నిర్వర్తించే సిబ్బందికి పూర్తి స్థాయి అవగాహన అవసరమని, ఎన్నికల నిర్వహణ బాధ్యత ఓపీఓలపై ఉందని ఆర్‌ఓ జేఎస్ రామారావు అన్నారు. స్థానిక లూథరన్ హైస్కూల్‌లో రెండు రోజుల పాటు జరిగే ఓపీఓల శిక్షణ తరగతులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నిబంధనలకు లోబడి సిబ్బంది విధులు నిర్వర్తించాలన్నారు. పోలింగ్ సమయంలో ఓపీఓలు మరింత సమన్వయంతో పని చేయాలన్నారు. ఈవీఎం, వీవీప్యాట్ల పనితీరు, ఓపీఓ డైరీ, ఇతర డాక్యుమెంట్లు పూర్తి చెయ్యడంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. పీఓ, ఏపీఓలతో పాటు ఓపీఓలు పోలింగ్ ప్రక్రియలో తప్పులకు తావులేకుండా, అప్రమత్తతతో వ్యవహరించాలని సూచించారు. అనంతరం ఈవీఎంల పనితీరు, పోలింగ్ ప్రక్రియ, అధికారుల విధులు, ఓటింగ్ కంపార్ట్‌మెంటు, బ్యాలెట్ బాక్సుల ఆపరేటింగ్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఆర్డీఓ కార్యాలయ ఏఓ సుబ్రహ్మణ్యం, పెద్దాపురం, సామర్లకోట తహసీల్దార్లు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్లు కేవీ పద్మావతి, రామారావు, డీటీ పద్మజ, భానుకుమార్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలి



ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

పెద్దాపురం: కట్టమూరు గ్రామంలో విద్యుదాఘాతంతో మృతి చెందిన వీర నాగేశ్వరరావు (నాగు) కుటుంబానికి న్యాయం చేయాలని ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక కార్మిక శాఖ కార్యాలయం వద్ద సోమవారం వర్కర్స్ సంఘ నాయకుడు గదుల నూకరాజు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ మాట్లాడుతూ మృతుడి కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన ఇంటి యజమాని వారిని మోసం చేశారని ఆరోపించారు. తక్షణమే అధికార యంత్రాంగం స్పందించి నాగు కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇంటి నిర్మాణానికి పంచాయతీ అనుమతులు లేవని, అయినా చూసీ చూడనట్టు వ్యవహరించిన పంచాయతీ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు గడపా శివబాబు, బత్తుల మురళి, నీలంశెట్టి శ్రీనివాస్, మలిరెడ్డి కృష్ణ, యర్ర రామకృష్ణ, సన్నిటి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

మూకుమ్మడిగా వలంటీర్ల రాజీనామా

గొల్లప్రోలు: ప్రజలకు నిస్వార్థంగా సేవలు అందిస్తున్న తమపై ఎన్నికల కమిషన్‌కు ప్రతిపక్షాలు ఫిర్యాదు చేయడాన్ని నిరసిస్తూ సోమవారం గొల్లప్రోలు మండలం చేబ్రోలులో గామ వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామా చేశారు. గ్రామంలోని 72 మంది వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామ చేశారు. తమ రాజీనామ పత్రాలను పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసుకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం ప్రజాసేవే లక్ష్యంగా పనిచేస్తున్న తమను సంఘ విద్రోహ శక్తులుగా చిత్రీకరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకుని ప్రజలకు సేవలందిస్తామని తెలిపారు.

ఆలయాల నిర్మాణానికి సహకరించాలి

కొత్తపల్లి: గ్రామాల్లో నూతన ఆలయాల నిర్మాణానికి భక్తులు సహకరించాలని మత్స్యకార నాయకుడు, హిందూధర్మ ప్రచారకుడు గంపల వెంకటరమణ కోరారు. మండలంలోని ఉప్పాడ శివారు నాయకర్ కాలనీలో సీతారాముల ఆలయ పునః ప్రతిష్ఠ మహోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. పండితులు ప్రత్యేక పూజలు చేసి ఆలయంలో స్వామివారి విగ్రహాలను ప్రతిష్ఠించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. బుధవారం సీతారాముల కల్యాణం సందర్భంగా భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ప్రతి ఒక్కరిపై రాముని ఆశీస్సులు ఉండాలి



రామాలయం నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న సునీల్‌తో పాటు దొరబాబు దంపతులు

పెద్దాపురం: రాష్ట్ర ప్రజలందరిపై శ్రీరాముని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని వైఎస్సార్ సీపీ కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, పెద్దాపురం ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు అన్నారు. పట్టణంలోని వరహాలయ్యపేట రామాలయం ఆలయ నిర్మాణానికి సోమవారం వారు ఆలయ కమిటీ సభ్యులతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీరాముని ఆలయ అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అభ్యర్థి దొరబాబు, ఆయన సతీమణి చంద్రకళ, మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, అగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ, కౌన్సిలర్లు తాటికొండ వెంకటలక్ష్మి, గోళ్ల విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చూడండి

పెద్దాపురం: వేసవిలో తాగునీటి ఎద్దడిపై అధికారులు దృష్టి సారించాలని పెద్దాపురం జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, వైస్ ఎంపీపీ మిరియాల రాజా అన్నారు. పెద్దాపురం మండల పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశం సోమవారం ఎంపీడీఓ జి.ఉషారాణి అధ్యక్షతన జరిగింది, ఈ సందర్భంగా జెడ్పీటీసీ, ఎంపీపీ మాట్లాడుతూ వేసవిలో ప్రజలు ఎదుర్కొనే మంచినీటి సమస్యపై అధికార యంత్రాంగం దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో మంచినీటిని సకాలంలో అందించాలని కోరారు. ఎంపీడీఓ ఉషారాణి మాట్లాడుతూ వేసవి దృష్ట్యా అన్ని గ్రామాల్లో మంచినీటి వసతిపై అన్ని చర్యలు చేపట్టామన్నారు. ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు. జిల్లా కలెక్టర్ అనుమతితోనే మండల సమావేశం నిర్వహించినట్టు ఎంపీడీఓ తెలిపారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ నక్కా సత్యనారాయణమూర్తి, సీడీపీఓ ఉష, కార్యాలయ పరిపాలనాధికారి సత్యనారాయణమూర్తి, ఆయా గ్రామాల ఎంపీటీసీలు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

కొత్తపల్లి: ప్రస్తుత వేసవిలో గ్రామల్లో తాగునీరు ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని, ప్రధాన పైపులైన్లు మరమ్మతులకు గురైతే ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేయాలని అధికారులను ఎంపీపీ కారే సుధ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలను పరిష్కరించవలసిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. మండల సమావేశాలకు హాజరయ్యే అధికారులు, ప్రజాప్రతినిధులు సమయపాలన పాటించాలని సూచించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎటువంటి తీర్మానాలు చేయలేదని ఎంపీడీఓ వెంకటనారాయణ తెలిపారు. కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ చెట్టుబత్తిన సురేష్‌కుమార్, పలు శాఖల అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.